'జగనన్న సురక్ష'తో అర్హులకు పథకాలు

ఆదోని టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 1, 2, 3, 9, 40 వార్డులకు సంబంధించిన సచివాలయ అధికారులు, వలంటీర్లతో ఇస్వీ రోడ్డులోని కల్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రకాల ధ్రువ పత్రాలు లేక పథకాలకు దూరమైన వారికి ఈ కార్యక్రమం సదావకాశమని వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 396 మందికి ఇన్‌కమ్, 390 మందికి క్యాస్ట్, జనన సర్టిఫికెట్లు 4 పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్, చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరు

ఆదోని రూరల్: పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎన్నికల్లో వారికి ఓటువేసే వారు కరువవుతారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని మదిరె గ్రామంలో ముందుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 870 మందికి కుల, ఇన్‌కం సర్టిఫికెట్లు, 36 మంది కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన పథకాలు, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించి బుక్‌లెట్ అందజేశారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఏపీఓ చంద్రశేఖర్, నాయకులు శ్రీలక్ష్మి, రేణుక, కల్పవల్లి, సర్పంచ్ నరసప్ప పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తమకు కస్తూర్బాలో బైపీసీ సీటు వచ్చేలా చూడాలని ముగ్గురు విద్యార్థినులు కోరగా ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అలాగే.. గ్రామానికి చెందిన పరశురాముడు ఇటీవల మృతి చెందాడు. మృతుడికి వైఎస్సార్ బీమా మంజూరు కావడంతో నామినీ అయిన భార్య హనుమంతమ్మకు బీమాకు సంబంధించిన చెక్కు అందజేశారు.


మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఉచితంగా కుల ధ్రువ పత్రం అందించారు


వార్డు, సచివాలయాలకు వెళ్లి క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా. వెంటనే పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్ అందించారు. ప్రజలకు ఖర్చులు, అవస్థలు తప్పించడం సంతోషకరం.
– అనురాధ, వాల్మీకి నగర్

ఆదాయ ధ్రువ పత్రాన్ని అందజేశారు


ఆదాయ ధ్రువ పత్రాన్ని వెంటనే అందించారు. ఇంత త్వరగా సర్టిఫికెట్లు జారీ చేసే ప్రభుత్వాన్ని ఇంతకు ముందు చూడలేదు. వార్డు, సచివాలయాల ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయి. సమయం ఆదా అవుతుంది. జగనన్న ప్రభుత్వం అంటే అందరికీ విశ్వాసం, నమ్మకం అనేది ఇందుకే.
– పద్మ, బాపూజీపేట, ఆదోని

క్లుప్తంగా

శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని మాధవరం రోడ్డులోని రాయిన గర్‌లో వెలిసిన శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు తెచ్చిన తైలంతో అభిషేకం, పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి తదితర పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తుల సాయంతో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే.. మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో శనిత్రయోదశి సందర్భంగా దోష పరిహార పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో శనిదోష పరిహార పూజలు, మృత్యుంజయ హోమం, తైలాభిషేకం తదితర పూజలు జరిగాయి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్ : వర్షాకాలంలో వచ్చే జబ్బుల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్లు గోపీనాథ్, దేశాయి, కృష్ణమూర్తి, నూరదాస్, కిరణ్‌కుమార్, శివరామ్, హరీష్, అనూష, మాయ తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఆదోని అర్బన్ : డాక్టర్స్ డే వేడుకలను స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలోని భాష్యం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.హరీష్‌కశ్యప్ హాజరై చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సదాశివ ఆరోగ్య చిట్కాలను తెలియజేశారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


చిన్నారి బహితను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ పోలీసులు

ఆదోని అర్బన్ : పట్టణానికి చెందిన బహిత అనే చిన్నారి శనివారం ఆడుకుంటూ ఇంటి నుంచి తప్పిపోయింది. స్థానికులు చిన్నారిని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారణ చేపట్టిన పోలీసులు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ దగ్గర నివాసముంటున్న మోగేష్ దంపతుల కుమార్తెగా నిర్ధారించుకొని, వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నారిని అప్పగించారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలం కేంద్రంతో పాటు మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు శనివారం భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నె ఆంజనేయస్వామి, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పిల్లలకు సక్రమంగా వడ్డించండి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు సరిపడా అన్నం వడ్డించాలని నెహ్రూ మెమోరియల్ పాఠశాల హెచ్‌ఎం అలిమ్‌సిద్దిఖీ సూచించారు. శనివారం పాఠశాలలోని కొందరు విద్యార్థులకు అన్నం తక్కువొచ్చిందని హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లగా..ఆయన వంట నిర్వాహకులను ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ పలావ్ చేయడంతో కొందరు విద్యార్థులు ఇష్టంగా తిన్నారని, దీంతో కొందరికి తక్కువొచ్చిన మాట వాస్తవమేనన్నారు. తాము ఎప్పటి లాగే వండుతున్నామని తక్కువగా వండలేదని హెచ్‌ఎంకు వివరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో గత ఏడాది 1,887 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 1,912 మంది ఉన్నారని చెప్పారు. ఇప్పటి వరకు 6వ తరగతిలో 268 మంది విద్యార్థులను, 7–10 వ తరగతి వరకు 200 మంది చేర్చుకున్నామని తెలిపారు. ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయని, రోజువారి హాజరును పరిగణలోకి తీసుకొని వండాలని సూచించారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ లబ్ధి


ధ్రువ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు


సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ


సర్టిఫికెట్ అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్

కోసిగి: అర్హత కలిగిన ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకేర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని, దీంతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని డి.బెళగల్ సచివాలయం–1లో జగన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కోసిగి–1 సచివాలయం పరిధిలో 203 దరఖాస్తులు, డి.బెళగల్‌లో 235 దరఖాస్తులు అందజేశారని చెప్పారు. అధికారులు వారందరికీ ధ్రువపత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు, మంగమ్మ, బుళ్లి నరసింహులు, దొడ్డి నరసన్నడి.బెళగల్ సర్పంచ్ పద్మమ్మ, వీరన్న, రవిగౌడ,మల్లికార్జున గౌడ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: జగనన్న సురక్షతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని దొడ్డి మేకల, బసలదొడ్డి గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ శ్రీనివాస రావు బృందం , తహసీల్దార్ వీరేంద్ర గౌడ బృందం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డిమేకలలో 44 మందికి, బసలదొడ్డిలో 56 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఈఓపీఆర్డీ ప్రభాకర్, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

కౌతాళం: జగనన్న సురక్ష కార్యక్రమం అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపిందని ఎంపీపీ అమరేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నదిచాగి, గుడికంబాలి గ్రామంలో కార్యక్రమం నిర్వహించి మొత్తం 448 సర్టిఫికెట్లు అందజేశారు. తహసీల్దారు రామేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్, గ్రామ ఇన్‌చార్జి రామన్నగౌడు, సర్పంచ్ సిద్దేశ్ పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత జనన ధ్రువ పత్రం వచ్చింది


నా కుమారుడు గణేష్ 2019 మార్చిలో జన్మిస్తే ఈ ప్రభుత్వం వల్ల ఇప్పుడు జనన ధ్రువ పత్రం కేవలం రెండు గంటల్లో పొందాను. ఎట్టకేలకు మా సమస్యకు పరిష్కారం లభించింది.
– మాల గంగమ్మ, నదిచాగి

జేవీకే కిట్ల పంపిణీపై విచారణ

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన జగనన్న విద్యా కానుకలను ప్రతి విద్యార్థికి అందించేలా చూడాలని సర్వశిక్ష అభియాన్ జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజు సూచించారు. శనివారం స్థానిక బాలర, బాలికల ఉన్నత పాఠశాల, డి.బెళగల్‌లో పాఠశాలలోని కిట్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు పిల్లల బయోమెట్రిక్ వేయించి కిట్లు అందించాలన్నారు. ఎంఈఓ నాగేశప్ప, రాజశేఖర్‌రప్ప, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజారాం ఉన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

కోసిగి: స్థానిక ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో ఈనెల 3వ తేదీన గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు సాయి రుత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఏటా గురుపౌర్ణమి రోజు వేకువ జాము నుంచి కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు ఉంటాయని వివరించారు.

ప్రశాంతంగా జీవించండి

కౌతాళం: ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం రాత్రి మండలంలోని తోవి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. పిల్లలను బాగా చదివించుకోవాలని చెప్పారు.

ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ

ఆదోని రూరల్ : పట్టణంలోని చార్వి ఆగ్రో ఎంటర్ ప్రైజెస్ విత్తన దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదోని మండల వ్యవసాయ అధికారులు శనివారం రాత్రి 8 గంటల సమయంలో తనిఖీ చేశారు. దుకాణంలో విత్తన ప్యాకెట్లను అధిక ధరలకు అమ్ముతున్నట్లుగా ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మొత్తం రూ.2,40,032 విలువజేసే పత్తి, ఇతర విత్తన నిల్వలను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేయగా, మిరప విత్తనాలు అధిక ధరలకు అమ్ముతున్నట్లుగా నిర్ధారించామన్నారు. దుకాణంలో రూ.23,520 విలువజేసే మిరప విత్తన ప్యాకెట్లను సీజ్ చేశామని వివరించారు.విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగరాజుయాదవ్, ఎస్ఐ జయన్న, ఏఓ రూఫస్ పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి

ఆదోని సెంట్రల్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్‌పీఎఫ్ జిల్లా కన్వీనర్ ఈ. లింగన్న తెలిపారు. పట్టణంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ వసతి గృహాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అయా మండలాల్లో వంద మంది బడి ఈడు పిల్లలను లద్దగిరి, పెద్దకడబూరు, నందవరం, గోనెగండ్ల, ఆదోని,కర్నూలు వంటి ప్రాంతాల్లో చేర్పించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఆదోని టౌన్ : పట్టణంలోని పదో వార్డు పరిధిలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఎమ్మెల్యే సహకారంతో నెరవేరుస్తామని చెప్పారు. 14ఏళ్ల టీడీపీ పాలనలో జరగని అభివృద్ధి నాలుగేళ్ల ఏళ్లలో చేసి చూపుతున్నామని తెలిపారు. ఈ నాలుగేళ్లలో మున్సిపాలిటీలో దాదా పు రూ.200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఎంఈ నాగభూషణంరెడ్డి, వైస్ చైర్మన్లు నరసింహులు, అబ్దుల్‌గౌస్, కౌన్సిలర్లు మహ్మద్‌స్వామి, వసీం, ఫయాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆదోని అర్బన్: సంతానం లేని వారికి వాసవీ కల్యాణ మందిరంలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఐవీఎఫ్ మెడికల్ కౌన్సెలింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు నగేష్ కాకుబాల్ తెలిపారు. శనివారం ఎస్‌కేడీ కాలనీలోని 3వ రోడ్డులోని వైట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. కర్నూలులోని ప్రైమ్ ప్లస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేపడతారని చెప్పారు. అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్త ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగిణి వసంత తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, చంటి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

పేదలందరికీ ఉచిత వైద్యం

కౌతాళం: పేదలందరికీ ఉచిత వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీపీ అమరేష్, ఎంపీడీఓ సుబ్బారాజు పేర్కొన్నారు. డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వసతులు, రోగుల గురించి, సమస్యలు, వైద్య సేవలపై డాక్టర్ పావనితో మాట్లాడి తెలుసుకున్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

- మాలపల్లి, కాచాపురం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సోదా
- రూ.16.19 లక్షల విలువ జేసీ విత్తనాల అమ్మకాలు నిలుపుదల

మంత్రాలయం : ఎరువులు, విత్తన దుకాణాల్లో ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. శుక్రవారం మండలం స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, మంత్రాలయం ఏఓ జీరా గణేష్ తనిఖీ చేశారు. మాలపల్లి, కాచాపురం గ్రామాల్లో విత్తన దుకాణాలపై దాడుల చేయగా రికార్డులు సరిగ్గా లేవని తేలింది. దీంతో దుకాణాల్లో రూ.16.19 విలువ జేసే మిరప, పత్తి, కంది విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. అక్రమంగా, రసీదులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

చెరువు సాగు చేస్తున్న వారిని నిలువరించండి

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పెద్ద చెరువును అక్రమంగా సాగుచేస్తున్నారని వెంటనే వారిని నిలువరించాలని చెరువు సాధన కమిటీ కన్వీనర్ యం.తాహేర్‌వలీ, గ్రామపెద్దలు రామదాసు, యశ్వత్‌రెడ్డి, పాండురంగ, వెంకటేష్, చిన్నోడు, గ్రామస్తులు కోరారు. శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం పెద్దతుంబళం ఎస్ఐ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పెద్ద చెరువును స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టులో కేసు తేలేంతవరకు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


పెద్దతుంబళం ఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

ఆస్పురి: ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ సూచించారు. శనివారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో నిర్మించిన హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్‌లో డీఆర్‌డీఏ– వైకేపీ ఆధ్వర్యంలో మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు దేవేంద్ర అధ్యక్షతన మండల రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఈఓ మాట్లాడుతూ పొదుపు మహిళలు, రైతుల పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం సెర్ప్ సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీలు, బ్యాంకు రుణాలను తీసుకొని వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆస్పరి మండలంలో జీన్స్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసకుంటామన్నారు. ఉపాధి పనులు ద్వారా పొలాల్లో ఫారం పండ్స్ ఏర్పాటు చేసుకున్నామని, వర్షపు నీరు గుంతల్లో నిలువ ఉంటుందని ఆనీటిని పైర్లకు తడిపేందుకు ప్రభుత్వం సబ్సీడీ ద్వారా అయిల్ ఇంజన్లను అందించాలని రైతులు సీఈఓను కోరాగా, స్పందించిన ఆయన అవసరమున్న రైతులకు సబ్సీడీ ద్వారా అయిల్ ఇంజిన్లును కొనుగోలు చేసి ఇవ్వాలని ఏపీఎం రాఘవేంద్రను ఆదేశించారు. అనంతరం శంకరబండ, చిగిళి రైతు గ్రూపు సభ్యులకు రూ.2లక్షల చొప్పున, ఆస్పరి రైతులకు టార్పాలిన్లు, స్ప్రింక్లర్లు, స్ప్రే గన్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఎండీ నాంచారయ్య, సెర్ప్ ఎస్‌పీఎంయూ కేశవకుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్‌రావు, డీపీఎం అబ్దుల్ రహిమాన్, డీపీఎం నరసమ్మ, ఏసీ నవీన్, హార్టికల్చర్ ఆఫీసర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.


ఆస్పరిలో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్

ప్రజలకు అందుబాటులో రొయ్యలు, చేపలు

ఎమ్మిగనూరు రూరల్: మొబైల్ వాహనంలో ప్రజల ఇంటి వద్దకే చేపలు, రొయ్యలు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో ఫిష్ ఆంధ్రా షాప్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, తహసీల్దార్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

చిప్పగిరి: తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై అసత్య ఆరోపణలు చేయడం టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మకు తగదని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. శనివారం గుమ్మనూరులో ఆయన మాట్లాడుతూ తాను ఎవరిపై దాడికి ప్రయత్నించలేదన్నారు. కొందరు టీడీపీ నాయకులతో కుట్రలు చేయించి ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండలంలో అల్లర్లు సృష్టించడానికి కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ఆలూరు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గుమ్మనూరు జయరామ్ గెలవడం ఖామన్నారు.

ఆలూరులో మోస్తరు వర్షం

ఆలూరు రూరల్: నైరుతి రుతు పవనాలు ప్రభావం కారణంగా శనివారం ఆలూరులో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు లేక పంటలు సాగు చేసిన రైతులకు ఈ వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఆలూరు మండలంలో మూడు వారాల క్రితమే రైతులు పత్తి, వేరుశనగ తదితర పంటలు సాగు చేశారు.

సమయానుసారంగా ఆరోగ్యసేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్‌ఎం, ఆశాల సమన్వయంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలోని ఆరోగ్య సేవలను ఎంఎల్‌హెచ్‌పీలు సమయానుసారంగా రోగులకు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పాము, తేలు, కుక్కకాటుకు ప్రథమ చికిత్స, రోడ్డు ప్రమాద కేసులకు సత్వర ప్రథమ చికిత్సలు అందించి పై ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించి ఆ వివరాలను హెచ్‌డబ్లూసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, నోడల్ ఆఫీసర్లు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.


కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డు చైర్‌పర్సన్, మెంబర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణ సేవల శాఖ పర్యవేక్షకుడు వైఎల్ ఎస్ దివాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత ఫార్మెట్‌లో జూలై 13వ తేదీలోపు విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం WD-CW.AP-GOV.IN అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

భాగస్వామ్య ప్రాజెక్టులతో విస్తృత పరిజ్ఞానం

కర్నూలు సిటీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఐట్రిపుల్‌ఈ) సంస్థలో భాగస్వామ్యం పొందిన కాలేజీల విద్యార్థులతో కలిసి చేసే ప్రాజెక్టుల ద్వారా విస్తృత పరిజ్ఞానం పెరుగుతుందని ఆ సంస్థ హైదరాబాద్ విభాగం ప్రతినిధి డా.తారా సాయికుమార్ అన్నారు. ఈ సంస్థలో భాగస్వామ్యం కలిగిన జి.పుల్లయ ఇంజినీరింగ్, రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన 22 శాఖల కార్యకలాపాలను శనివారం ప్రారంభించారు. కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఐట్రిపుల్‌ఈ సొసైటీ హైదరాబాద్ విభాగం ప్రతినిధి అతిథిగా హాజరై ప్రసంగించారు.

హొళగుంద హైస్కూల్ తనిఖీ

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్‌పాల్ తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆయనకు ఏఐఎస్‌ఎఫ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సతీష్ కుమార్, మల్లికార్జున, తిక్కస్వామి, సురేశ్‌శెట్టి తదితరులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఏడీ.. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'జగనన్న గోరుముద్ద' తనిఖీ

హాలహర్వి: మండలంలోని గూళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠవాలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని శనివారం ఎంఈఓ–1 ఈరన్న, ఎంఈఓ–2 శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా వారు బయోమెట్రిక్ విధానం, కొత్త అడ్మిషన్లపై హెచ్‌ఎం గోపీని అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌ఎంలకు నోటీసులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని నెహ్రూ మెమోరియల్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పాఠశాలల హెచ్‌ఎంలు విచారణకు హాజరు కావాలని ఏపీ సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసిందని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 9 నెలల క్రితం రెండు పాఠశాలలకు 2015–16 విద్యా సంవత్సరం నుంచి ఆయా పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ గ్రాంట్స్, ఖర్చుల వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లను, నాడు–నేడు మొదటి విడత కింద వచ్చిన వస్తువుల జాబితా వివరాలను కోరగా హెచ్‌ఎంలు సమాచారం ఇవ్వలేదన్నారు. దీంతో కమిషన్‌లో అప్పీల్ చేయడంతో మంగళగిరిలోని కార్యాలయానికి విచారణకు రావాల్సిందిగా నోటీసులు పంపారని చెప్పారు. రెండు పాఠశాలల్లో స్కూల్ గ్రాంట్స్ వినియోగంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

ట్యాంక్‌లతో నీటి సరఫరా


ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఏరిగేరి గ్రామానికి మంచి నీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నామని సర్పంచ్ గోవిందు, ఎంపీటీసీ అయ్యన్న, గ్రామ ఇన్‌చార్జ్ నీలకంఠరెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామానికి తాగునీరు అందించే హనువాళు ఎస్‌ఎస్ ట్యాంకులో నీరు లేకపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని, నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ట్యాంకులతో సరఫరా చేస్తున్నామని చెప్పారు.